సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 29 । ఆగస్టు । 2024



అనాథలపై వాత్సల్యం

మిషన్ వాత్సల్య పథకం అనాథ చిన్నారులకు వరంగా మారింది. 18 ఏళ్ల లోపువారికి ప్రతి నెలా రూ.4 వేల సాయం అందిస్తున్నారు. 8లో ▸



అర్జావారిగూడెంలో హత్య

భీమడోలు పంచాయతీ అర్జావారిగూడెంలో దారుణ హత్య జరిగింది. ఆస్తి తగాదా నేపథ్యంలో జరిగిన ఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. 8లో ▸



ప్రసాదంలో పురుగుపై విచారణ

ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి పులిహోర ప్రసాదంలో పురుగు రావడంపై అధికారుల ఆదేశాల మేరకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ నిర్వహించారు. 8లో ▸



దోషులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం హేయమైన చర్య. ఈ ఘటన సభ్య సమాజానికి సిగ్గుచేటు. బాధితులకు న్యాయం జరిగేలా దోషులను కఠినంగా శిక్షించాలి. ఇలాంటివి పునరావృతం కాకుండా దేశవ్యాప్తంగా ప్రత్యేకమైన చట్టాలు తీసుకురావాలి. రాత్రి సమయంలో ఆసుపత్రిలో పనిచేసే మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలి. అప్పుడే మహిళా సిబ్బంది ధైర్యంగా ఆసుపత్రిలో సేవలందిస్తారు.

– డాక్టర్ టీవీఎల్‌పీ కుమార్, సివిల్ అసిస్టెంట్ సర్జన్, ప్రభుత్వ ఆసుపత్రి, కామవరపుకోట

ఇలాంటివి పునరావృతం కాకూడదు



ప్రజల ప్రాణాలు కాపాడడం కోసం కుటుంబాన్ని వదిలి వృత్తినే దైవంగా భావించి పనిచేసే వైద్యుల రక్షణ కోసం కఠినమైన చట్టాలు రూపొందించాలి. విధి నిర్వహణలో ఉన్న వైద్యురాలిపై కోల్‌కతాలో జరిగిన హత్యాచార ఘటన దారుణం. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కఠినమైన చట్టాన్ని రూపొందించాలి. అప్పుడే వైద్యులు ధైర్యంగా పనిచేయగలుగుతారు.

– డాక్టర్ పి.పూర్ణిమ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి, పెదవేగి

న్యూస్‌రీల్

డీఎస్పీగా మురళీకృష్ణ బాధ్యతల స్వీకరణ



మురళీకృష్ణ, నరసాపురం డీఎస్పీ

నరసాపురం: నరసాపురం డీఎస్పీగా మురళీకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం 5వ బెటాలియన్ డీఎస్పీగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. డివిజన్ లోని సీఐలు, ఎస్సైలు డీఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ డివిజన్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానన్నారు. ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ముందుగా డివిజన్‌లో సమస్యలను అధ్యయనం చేసి వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు జి.జేమ్స్ కోరారు. బుధవారం డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ అధికారికి సమస్యల పరిష్కారంపై వినతి పత్రం అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇన్‌కంట్యాక్స్ మినహాయింపు రాష్ట్రమంతా ఒకేలా అమలు చేయాలని, ఫ్యామిలీ పెన్షనర్స్ పుట్టిన తేదీ నమోదులో ఎదుర్కొంటున్న సమస్యను త్వరతగతిన పరిష్కరించేలా ఎస్‌టీఓలకు తగిన ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో భీమవరం యూనిట్ అధ్యక్షుడు ఎస్ఎస్ఎస్ పాల్, ప్రధాన కార్యదర్శి పి.సీతారామరాజు, కోశాధికారి సూర్యనారాయణ, జాయింట్ సెక్రటరీ అప్పన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీవారి క్షేత్రంలో వరలక్ష్మీ వ్రతాలు



వరలక్ష్మీ అమ్మవారిగా ముస్తాబు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయంలో ఆఖరి శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని అనివేటి మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి జరిగే ఈ వేడుకలో పెద్ద ఎత్తున ముత్తయిదువలు పాల్గొనాలని ఆయన కోరారు.

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ



డీఈవో కార్యాలయంలో చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏటా హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలు 2024 పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖాధికారిణి జి.నాగమణి బుధవారం ఆవిష్కరించారు. డీఈవో కార్యాలయంలో చెకుముకి జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్నబాబు మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాలు విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, సైన్స్ పట్ల అభిరుచి పెంపొందిస్తుందన్నారు. పాఠశాల స్థాయిలో సెప్టెంబర్ 25న, మండల స్థాయిలో అక్టోబర్ 1న, జిల్లా స్థాయిలో అక్టోబర్ 27న, రాష్ట్ర స్థాయిలో నవంబర్ 9, 10 తేదీల్లో నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.సత్యనారాయణ, జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతపల్లి ప్రసాదరావు, జి.రామ లక్ష్మణరావు, కోశాధికారి మల్లుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరం.. కలవరం

- జిల్లాను పట్టి పీడిస్తున్న డెంగీ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు
- ఇంతవరకూ 12 డెంగీ కేసుల నమోదు
- అనధికారికంగా పదుల సంఖ్యలో కేసులు
- ఈ నెలలో 71 టైఫాయిడ్ కేసుల నమోదు
- ప్రైవేట్ ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితులు
- దోమల నివారణకు చర్యలు శూన్యం



భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో రక్త పరీక్షల కోసం క్యూకట్టిన జనం

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో విష జ్వరాలు కలవరం పుట్టిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా ఒక్కసారిగా జ్వరాలు విరుచుకుపడడంతో జనం ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. వైరల్ ఫీవర్లతో పాటు టైఫాయిడ్, డెంగీ కేసులు పెరిగిపోయాయి. డెంగీ జ్వరం వస్తే రోజులు తరబడి చికిత్స తీసుకోవాల్సి వస్తోంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వేల రూపాయలు ఖర్చు చేసి చికిత్స తీసుకుంటున్నారు. జిల్లాలో ఏ ల్యాబ్ చూసినా జ్వరాల పరీక్షల కోసం వచ్చేవారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వ ఆస్పత్రుల ల్యాబ్‌ల వద్ద జనం రక్తపరీక్షల కోసం క్యూ కడుతున్నారు. జిల్లాలో ఈ నెలలో ఇంతవరకూ అధికారిక లెక్కల ప్రకారం 10 డెంగీ కేసులు నమోదయ్యాయి. జూలై నుంచి ఇంతవరకూ 12 డెంగీ కేసులు నమోదయ్యాయి. అనధికారికంగా ఇంకా ఎక్కువ ఉన్నాయి. టైఫాయిడ్ కేసులు ఈ నెలలో 71కి పైగా నమోదయ్యాయి. ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి పూర్తి సమాచారం తీసుకుంటే డెంగీ, టైఫాయిడ్ కేసులు మరిన్ని బయటపడతాయి. జిల్లాలో దాదాపు ప్రతి ఆస్పత్రిలో టైఫాయిడ్ జ్వర బాధితులు చికిత్స తీసుకుంటున్నారు. అన్ని విభాగాల వైద్యులు అందుబాటులో ఉండే పెద్ద ఆస్పత్రుల్లో డెంగీ కేసులకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఆయా ఆస్పత్రులకు వైద్య, ఆరోగ్య సిబ్బంది వెళ్లి పరిశీలన చేస్తే అసలు బాధితుల సంఖ్య తెలుస్తుంది.

జిల్లాలో జ్వరాల వివరాలు

డెంగీ కేసులు(అధికారికంగా మాత్రమే)	
జూలైలో : 2	ఆగస్టులో: 10 (ఇంతవరకూ)
టైఫాయిడ్ కేసులు	
జూలై : 83	ఆగస్టులో: 71 (ఇంతవరకూ)
వైరల్ జ్వరాలు	
జూలైలో: 2,224	ఆగస్టులో: 2,123

క్యాంపుల ఊసే లేదు

జిల్లాలో జ్వరాలు విజృంభిస్తున్నప్పటికి పట్టణాల్లో గానీ గ్రామాల్లో గానీ వైద్య క్యాంపులు ఏర్పాటు చేయడం లేదు. జ్వరాలపై సర్వే చేయడం లేదు. ఎక్కడైనా జ్వరం కేసు ఉంటే ఆ చుట్టుపక్కల నాలుగు కుటుంబాలను జ్వరాలు ఉన్నాయా అని సిబ్బంది అడిగి వెళ్లిపోతున్నారు. కనీసం విలేజ్ క్లినిక్‌ల ద్వారా జ్వరాలపై సర్వే, వైద్యం అందించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదు. జిల్లాలో ఏ గ్రామంలో కూడా వర్షాలు పడ్డాక పారిశుద్ధ్యం మెరుగుపరిచే చర్యలు తీసుకోలేదు. జ్వరాలు వ్యాపించకుండా దోమలు, లార్వా నిర్మూలన మందులు పిచికారీ చేయడం లేదు. కొన్ని పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లే చర్యలు తీసుకోవడం లేదు.

గత ప్రభుత్వ హయాంలో సకాలంలో చర్యలు



లంకలకోడేరు పీహెచ్‌సీలో జ్వరానికి వైద్యం అందిస్తున్న దృశ్యం

గత ప్రభుత్వం ప్రతి ఏటా జూన్ నుంచి ఆగస్టు వరకు సీజనల్ వ్యాధులపై దృష్టి పెట్టి సకాలంలో గ్రామాల్లో, వార్డుల్లో వైద్య క్యాంపుల నిర్వహణ, జ్వరాలపై సర్వే నిర్వహించింది. దీంతో సకాలంలో వైద్య సేవలు అందేవి. విలేజ్ క్లినిక్ ద్వారా జ్వరాలపై నివేదిక తెప్పించుకుని ఆయా గ్రామాలకు సంబంధించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటించేలా చూసేది. జ్వరాల కేసులకు వైద్య సేవలు అందించేవారు. తర్వాత ఫ్యామిలీ డాక్టర్ విధానంలో కూడా సీజనల్ వ్యాధులకు స్థానికంగా వైద్యం అందించడం, జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల ద్వారా టైఫాయిడ్, డెంగీ జ్వరాలను గుర్తించి సకాలం వైద్య సేవలు అందించేవారు. నేడు ప్రైవేట్ ఆస్పత్రుల్లో వేల రూపాయలు ఖర్చు చేసి జ్వరాలు తగ్గించుకునే పరిస్థితి ఏర్పడింది.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం



నూతన విద్యా విధానంపై మాట్లాడుతున్న అకడమిక్ మానిటరింగ్ అధికారి ఏ.సుబ్బారెడ్డి

ఆకివీడు: నూతన విద్యా విధానంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని రాష్ట్ర అకడమిక్ మానిటరింగ్ అధికారి, విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ ఏ.సుబ్బారెడ్డి చెప్పారు. మండలంలోని పెదకాపవరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం మానిటరింగ్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా పాఠశాలలో రికార్డులు, విద్యా విధానం, బోధన, రిజిస్ట్రర్లను పరిశీలించారు. అనంతరం సర్వ శిక్ష అభియాన్ బృందంతో, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో సామర్థ్యాన్ని పెంపొందించేందుకు పలు సూచనలు చేయాలన్నారు. నూతన విద్యా విధానంలో ఇంగ్లీష్ విద్యా బోధన సరళ విధానంలో నిర్వహించాలన్నారు. చదవలేని విద్యార్థులకు అదనపు క్లాసులు తీసుకుని వారి సామర్థ్యాన్ని పెంపొందించాలన్నారు. లెక్కలు, ఇంగ్లీషు, సైన్సు పట్ల విద్యార్థుల్లో ఏ విధమైన అవగాహన ఉందో పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బీ.కాళహస్తేశ్వరుడు, మానిటరింగ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉత్సాహం ఉట్టిపడేలా

శ్రీవారి క్షేత్రంలో నేత్రపర్వంగా ఉట్ల పండుగ



శ్రీవారి కల్యాణ మండప ప్రాంతంలో ఉట్టి కొడుతున్న యువకులు

ద్వారకాతిరుమల: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పురస్కరించుకుని శ్రీవారి దివ్య క్షేత్రంలో బుధవారం సాయంత్రం ఉట్ల పండుగ, స్వామివారి తిరువీధి సేవలు అంగరంగ వైభవంగా జరిగాయి. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను రాజాధిరాజ వాహనంపై ఉంచి అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి వాహనం ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. శ్రీవారి కల్యాణ మండపం వద్ద దేవస్థానం ఏర్పాటు చేసిన ఉట్టిని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు యువకులకు అందించారు.

అనంతరం యువకులు దాన్ని ఉత్సాహంగా కొట్టారు. క్షేత్రంలోని పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన ఉట్లను కొడుతూ యువకులు సందడి చేశారు. క్షేత్రంలో పలుచోట్ల ఉట్లు కొట్టిన యువకులకు కొందరు వ్యాపారులు బహుమతులు అందజేశారు.

30న ఏలూరులో జాబ్ మేళా

ఏలూరు (టూటౌన్): జిల్లా ఉపాధి కార్యాలయం(నేషనల్ కెరీర్ సర్వీస్), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30న ఉదయం 10 గంటలకు ఏలూరు కలెక్టర్ కాంపౌండ్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు బుధవారం తెలిపారు. బజాజ్ క్యాపిటల్, ఎల్ఐసి ఆఫ్ ఇండియా, అమెజాన్(కెఎల్ గ్రూపు) ప్రతినిధులు హాజరు కానున్నట్లు చెప్పారు. జీతం నెలకు రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు ఇస్తారని, ఎన్నికైన వారికి మూడు నెలల శిక్షణ ఇస్తారన్నారు. అభ్యర్థులు ఇంటర్ లేదా డిగ్రీ చదివి 18 నుంచి 32 ఏళ్ల మధ్య వయసు ఉండాలన్నారు. ఎల్ఐసిలో ఏలూరు జిల్లా వ్యాప్తంగా పనిచేసేందుకు పదో తరగతి ఉత్తీర్ణులై 18 సంవత్సరాలు పైబడిన వారు అర్హులని పేర్కొన్నారు. అమెకజాన్(కెఎల్ గ్రూప్)లో వేర్ హౌస్ అసోసియేట్స్ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని, జీతం రూ.18000లతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 88868 82032 నెంబరులో సంప్రదించాలన్నారు.

రూ.2.98 కోట్లకు ఫెర్రీ వేలం


నరసాపురం రూరల్: నరసాపురం మండల పరిషత్ ఆధీనంలోని మాధవాయిపాలెం ఫెర్రీ వేలంపాట 2024–2025 సంవత్సరానికి రూ.2.98 కోట్లకు ఖరారైంది. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో డిప్యూటీ సీఈవో నిర్మలా జ్యోతి ఆధ్వర్యంలో ఫెర్రీ వేలం నిర్వహించారు. సీల్డ్ కం బహిరంగ వేలం ప్రక్రియలో జరిగిన ఈ వేలం పాటలో యలమంచిలి మండలం కనకాయలంకకు చెందిన ది కనకదుర్గా శాండ్ క్వారీ బోట్స్ మెన్ ఫీల్డ్ లేబర్ ఫిషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీ రూ. 2.98 కోట్లకు హెచ్చుపాటదారుగా నిలిచారు. తొలుత బహిరంగ పద్ధతిలో నిర్వహించిన వేలంలో నరసాపురం పన్నుపల్లికి చెందిన అమరేశ్వర బోట్స్ అండ్ సొసైటీ రూ.2,97,88,717కు పాట పాడారు. టెండర్ షెడ్యూళ్లు ఆరుగురు కొన్నా ముగ్గురు మాత్రమే వేలంలో పాల్గొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన కాలం(సెప్టెంబరు 2024 నుంచి 31 మార్చి 2025) వరకూ ఫెర్రీ టోల్ వసూలుకు పాటదారుడికి అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం, సఖినేటిపల్లి ఎంపీడీవోలు వీకే వీరభద్రరావు, వి.మల్లికార్జునరావు, ఎంపీపీ మైలాబత్తుల సోని తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ ప్రత్యేక కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): బీఈడి ప్రత్యేక విద్యా కోర్సు 2024–26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ జారీ చేసినట్లు పరివర్తన్ పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల ఈ స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రత్యేక విద్య కోర్సులో ప్రవేశానికి నోటికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారు డీఎస్సీ, సర్వ శిక్షాభయాన్(రాజీవ్ విద్యామిషన్)లో ఐఇఆర్‌టి రీసోర్సు టీచర్లుగా, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, సీబీఎస్ఈ స్కూల్స్, ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల్లో ఉపాధి పొందవచ్చని సెప్టెంబరు 10 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పారిశుధ్య కాంట్రాక్టులో తిరకాసు

- శ్రీవారి దేవస్థానం అధికారుల వింత పోకడ
- కాంట్రాక్టు సమయం ముగుస్తున్నా పిలవని కొత్త టెండర్
- పారిశుధ్య పనులు అధ్వానంగా ఉన్నా కాంట్రాక్టు పొడిగింపునకు యోచన



ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల: వడ్డించేవాడు మనవాడైతే.. అన్న చందంగా ఉంది ద్వారకాతిరుమల చినవెంకన్న దేవస్థానం అధికారులు తీరు. క్షేత్రంలో మరో నెల రోజుల్లో ముగియనున్న పారిశుధ్య కాంట్రాక్టు గడువును పొడిగించి, సంబంధిత కాంట్రాక్టరుకు లబ్ధి చేకూర్చే యోచనలో అధికారులు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే పారిశుధ్య పనులకు కొత్త టెండర్ పిలవకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పారిశుధ్య పనులు అధ్వానంగా ఉన్నా, కార్మికుల ఖాతాల్లోకి పీఎఫ్‌ల నగదు సరిగా జమ చేయకపోయినా.. అధికారులు వాటిని పట్టించుకోకుండా కాంట్రాక్టు గడువును పొడిగించేందుకు చూస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రధాన దేవాలయాల్లో కొందరు కాంట్రాక్టర్లు తమ పారిశుధ్య టెండర్ల గడువును పొడిగించాలని అర్జీలు పెట్టుకోగా, అక్కడి అధికారులు వాటిని తిరస్కరించి కొత్తగా టెండర్లు పిలుస్తున్నారు.

2022 అక్టోబర్ నుంచి..

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని నిత్యం వేలాది మంది భక్తులు దర్శిస్తుంటారు. వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ఎన్నో చర్యలు చేపడుతున్నారు. అందులో పారిశుధ్య పనులు అత్యంత ముఖ్యమైనవి. వీటి కోసం అధికారులు ప్రతి నెలా లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. దీనిలో భాగంగా 2022 అక్టోబర్‌లో హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ క్షేత్రంలో పారిశుధ్య పనులను దక్కించుకున్నారు. వచ్చే నెలాఖరుకు ఆ కాంట్రాక్టు గడువు ముగియనుంది. అయితే మూడు నెలల ముందు నుంచే మొదలవ్వాల్సిన కొత్త టెండర్ ప్రక్రియ ఇంకా ప్రారంభం కాకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఒక్క సెలవు పెట్టినా జీతం కట్

క్షేత్రంలో 135 మంది పారిశుధ్య కార్మికులతో పనులు చేయించాల్సి ఉండగా, 80 నుంచి 90 మందితో మాత్రమే చేయిస్తున్నారు. ఒక్కో కార్మికుడికి నెలకు నాలుగు సెలవులు ఇవ్వాలి. రెండు షిఫ్టుల్లో పనులు చేయించాలి. అయితే ఇక్కడ ఒక్క సెలవు కూడా ఇవ్వకపోగా, ఒక్క సెలవు పెట్టినా రూ.300లు కట్ చేస్తున్నారని, ఓటీల నగదు కూడా ఇవ్వడం లేదని కొందరు కార్మికులు చెబుతున్నారు. ఈ విషయాలను బహిర్గతం చేస్తే అధికారులు తమను పనిలోంచి తీసేస్తారని వారు ఆందోళన చెందుతున్నారు.

పీఎఫ్‌ల చెల్లింపుపై అనుమానాలు

ఒక్కో పారిశుధ్య కార్మికుడికి కాంట్రాక్టర్ నెలకు రూ.9,700 వేతనం ఇవ్వాల్సి ఉండగా, సెలవుల పేరుతో అందులో కటింగ్‌లు విధిస్తున్నారు. రూ.2,372 పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాల్సి ఉండగా రూ.500 నుంచి రూ.600 మాత్రమే చెల్లిస్తున్నట్టు సమాచారం. ప్రతి నెలా దేవస్థానం నుంచి బిల్లును పొందేందుకు కాంట్రాక్టర్ పీఎఫ్ ఈసీఆర్‌ను అధికారులకు సమర్పించాలి. వాటిని తనిఖీ చేసిన తరువాతే బిల్లుల చెల్లింపు జరపాలి. ఇక్కడ అవేమీ జరగకుండానే బిల్లుల చెల్లింపులు జరిగిపోతున్నట్టు తెలుస్తోంది. ప్రతి నెలా తమ ఖాతాలో పీఎఫ్‌ల సొమ్ము ఎంత జమ అవుతున్నదన్నది కార్మికులకు కూడా తెలియడం లేదు.

పర్యవేక్షణా లోపం : కాంట్రాక్టరుకు ప్రతి నెలా బిల్లుగా రూ.16 లక్షలకు పైగా దేవస్థానం చెల్లిస్తోంది. ఎంత మంది కార్మికులు పనిచేసినా చెల్లింపులు మాత్రం నెలకు ఒకేలా జరుగుతున్నాయి. కాంట్రాక్టర్ మాత్రం కార్మికులకు కటింగ్‌లు విధిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో 28 రోజులు కావడంతో సంబంధిత కాంట్రాక్టరు కార్మికులకు 28 రోజులకు మాత్రమే జీతాలు చెల్లించారు. దేవస్థానం నుంచి కాంట్రాక్టర్ పూర్తి బిల్లును తీసుకున్నారు. అధికారుల పర్యవేక్షణా లోపం కారణంగానే ఈ అవకతవకలు జరుగుతున్నాయని, ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

గడువు పొడిగింపును పరిశీలిస్తున్నాం

దీనిపై ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావును వివరణ కోరగా కాంట్రాక్టు గడువు పొడిగింపు అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. పారిశుధ్య కార్మికుల పీఎఫ్‌ల చెల్లింపు, ఇతర అంశాల్లో అవకతవకలు జరిగినట్టు తన దృష్టికి రాలేదని, విచారణ జరుపుతామని తెలిపారు.

రెవెన్యూ రికార్డుల భద్రతకు చర్యలు తీసుకోవాలి

తణుకు టౌన్: రెవెన్యూ రికార్డుల భద్రతకు తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. బుధవారం తణుకు తహసీల్దార్ కార్యాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులు పరిశీలించారు. రెవిన్యూ కార్యాలయంలోని రికార్డుల్ని సంవత్సరాల వారీగా, కేటగిరీల వారీగా భద్రపర్చాలని కోరారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా కుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందజేయాలన్నారు. తణుకు మండలంలో 6,530 కుటుంబాలకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాల్సి ఉండగా ఇప్పటికే 6283 కుటుంబాలకు జారీకి చర్యలు తీసుకున్నామన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ కండక్టర్ శ్రీనివాస్ నిజాయతీ



ప్రయాణికుడికి బంగారు ఆభరణాన్ని అందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్ : బస్సులో ప్రయాణిస్తూ బంగారు ఆభరణాన్ని జారవిడుచుకున్న ప్రయాణికుడికి తిరిగి అందజేయడంలో తణుకు ఆర్టీసీ డిపో కండక్టర్ నూతలపాటి శ్రీనివాస్ నిజాయతీని ఆర్టీసీ అధికారులు, పోలీసు అధికారులు ప్రశంసించారు. నడిపల్లి గ్రామానికి చెందిన కరుటూరి భీమరాజు తణుకు డిపో బస్సులో ఈనెల 11వ తేదీన ప్రయాణిస్తూ 5 కాసుల విలువైన బంగారు ఆభరణాన్ని జారవిడిచి బస్సు దిగిపోయారు. బస్సు డిపోకు చేరిన సమయంలో ఆభరణాన్ని గమనించిన శ్రీనివాస్ డిపో మేనేజర్ సప్పా గిరిధర్‌కుమార్ ఆదేశానుసారం సెక్యూరిటీ సమక్షంలో క్లర్క్‌కి అప్పగించారు. బుధవారం రూరల్ ఎస్సై ఏజీఎస్ మూర్తి, మేనేజర్ గిరిధర్‌కుమార్ చేతులమీదుగా ప్రయాణికుడికి ఆభరణాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కండక్టర్ శ్రీనివాస్‌ను ఆర్టీసీ సిబ్బంది, పోలీసులు, నడిపల్లి గ్రామస్తులు అభినందించారు.

శ్రీవారి పులిహోర ప్రసాదంలో పురుగుపై విచారణ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి పులిహోర ప్రసాదంలో పురుగు రావడంపై కలెక్టర్ కె.వెట్రిసెల్వి, రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావును విచారణకు ఆదేశించారు. వివరాల్లోకి వెళితే.. ఏలూరుకు చెందిన బలభద్ర రామయ్య అనే భక్తుడు కుటుంబ సభ్యులతో కలసి మంగళవారం క్షేత్రానికి విచ్చేసి మొక్కులు తీర్చుకుని శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ప్రసాదాల కౌంటర్‌లో 12 పులిహోర, 12 శర్కరపొంగలి, 12 లడ్డూ ప్రసాదాలను కొనుగోలు చేసి, స్వగ్రామానికి తీసుకెళ్లారు. అనంతరం పులిహోర తినేందుకు ప్యాకెట్‌ను ఓపెన్ చేయగా అందులో పురుగు కనిపించింది. ఆ ఫొటోలు బుధవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై కలెక్టర్ వెట్రిసెల్వి, దేవదాయశాఖ కమిషనర్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామరాజు బుధవారం ప్రసాదాల తయారీ కేంద్రం (అంబరుఖానా)ను పరిశీలించారు. దీనిపై విచారణ చేపట్టిన ఈఓ త్రినాథరావు ప్రసాదాల తయారీ కాంట్రాక్టర్ రవీంద్రను సంజాయిషీ కోరుతూ నోటీసు జారీ చేశారు. అలాగే సంబంధిత సెక్షన్ ఏఈఓ, సూపరింటెండెంట్, సిబ్బంది నుంచి వివరణ కోరారు.



కోల్‌కతా ఘటనలో బాధ్యులను ఉరితీయాలి



ప్రాణాలను రక్షిస్తే వైద్యులను దేవుళ్లని పొగుడుతారు. అటువంటి వైద్యుల ప్రాణాలను కబళిస్తే అర్థం ఏమిటి? వైద్యులకు పూర్తి రక్షణ కల్పించే చట్టాలు చేసి, వాటిని సమగ్రంగా అమలు చేయాలి. కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై హత్యాచారం సంఘటనలో బాధ్యులను ఉరి తీసి, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ షకీనా ఇవాంజిలిన్, వైద్యాధికారి ముసునూరు పీహెచ్‌సీ

కోల్‌కతా ఘటన అమానుషం



కోల్‌కత్తా సంఘటన అత్యంత అమానుషం. ప్రాణాలు నిలిపేవారిపైనే అత్యాచారం చేసి హత్య చేయడం దారుణం. ఈ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి. వైద్యులపై దురుసు ప్రవర్తన, దాడులు చేసేవారికి కఠిన శిక్షలు అమలు చేయడం ద్వారా వారికి మెరుగైన భద్రత కల్పించాలి. వైద్యులు, ఆరోగ్య సిబ్బంది రక్షణకు ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకోవాలి.

– ఏఎస్ భృంగేశ్వరరావు, ఎంపీహెచ్ఈఓ, సిద్ధాంతం పీహెచ్‌సీ

అనాథలపై వాత్సల్యం

- తల్లి, తండ్రి లేదా ఇద్దరినీ కోల్పోయిన చిన్నారులకు వరంగా మిషన్ వాత్సల్య పథకం
- ఏలూరు జిల్లాలో 417 మంది ఎంపిక.. విద్య, వైద్యం, ఇతర అవసరాలు తీర్చేలా
- 18 ఏళ్ల లోపువారికి ప్రతి నెలా రూ.4 వేల సాయం.. రూ.1.08 కోట్ల బడ్జెట్ కేటాయింపు

వాళ్లిద్దరూ అక్కాచెల్లెళ్లు. వీరికి ఐదేళ్ల వయస్సులో తల్లిదండ్రులు క్షణికావేశంతో ఆత్మహత్య చేసుకుని తనువు చాలించారు. బిడ్డలు అమ్మమ్మ ఇంటి వద్ద పెరిగారు. పెద్ద పాప 9వ తరగతి చదువుతుండగానే పెళ్లి చేయడానికి సిద్ధపడగా, మైనార్టీ తీరని బిడ్డకు వివాహం చేయడాన్ని ఐసీడీఎస్ అధికారిణి అడ్డుకుంది. ఇప్పుడు ఆ పాప పదిలో ఎక్కువ మార్కులు తెచ్చుకుని భీమవరంలో ఇంటర్ చదువుతోంది. మిషన్ వాత్సల్య పథకం ద్వారా రూ.24 వేలను బ్యాంక్ ఖాతాకు జమ చేశారు.

మరో ఘటనలో పురిటిలోనే బిడ్డను కని తల్లి కన్నుమూసింది. కొన్నాళ్లకు తండ్రి కూడా మరణించాడు. ఒక్కగానొక్క కొడుకు. అతని బాధ్యతను బామ్మ తీసుకుంది. ఆ బాలుడు ఇప్పుడు 6వ తరగతి చదువుతున్నాడు. అతనికి మిషన్ వాత్సల్య పథకం ద్వారా బ్యాంకు ఖాతాలో నగదు జమ చేశారు. ఈ విధంగా అనాథలకు మిషన్ వాత్సల్య పథకం అండగా నిలుస్తోంది.



కైకలూరులో మిషన్ వాత్సల్య పథకానికి నియోజకవర్గంలో ఎంపికైన చిన్నారులు (ఫైల్)

కైకలూరు: తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయిన పిల్లలు.. తల్లి లేదా తండ్రి మాత్రమే ఉన్న పిల్లలు.. అక్రమ రవాణా, ప్రకృతి వైపరీత్యాలకు గురైన పిల్లలు.. కోవిడ్ సమయంలో తల్లిదండ్రులను పోగొట్టుకున్నవారు.. విడాకులు తీసుకున్న దంపతుల పిల్లలు.. హెచ్ఐవీతో మరణించిన తల్లిదండ్రుల పిల్లలు.. పేద యాచకుల పిల్లల విద్య, వైద్యం ఇతర అవసరాలు తీర్చడానికి మిషన్ వాత్సల్య పథకం శాతం వాటాతో ప్రతి నెలా రూ.4 వేలను ఉపకార వేతన రూపంలో ఈ సాయం అందిస్తారు. ఏలూరు జిల్లాలో 417 మందికి రూ.1.08 బడ్జెట్ కేటాయించి ఖాతాలకు జమ చేశారు. సంరక్షకులు పిల్లల విద్యా, వైద్యానికి ఈ నగదు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

ఇలా దరఖాస్తు చేసుకోవాలి

క్షేత్ర స్థాయిలో అనాథల పిల్లల సాయం కావాలని కోరిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రాలలో కార్యకర్తలు దరఖాస్తును అందిస్తారు. అనంతరం పిల్లల వాస్తవ పరిస్థితులను విచారణ చేసి మండల స్థాయి అక్కడ నుంచి జిల్లా స్థాయి కమిటీ కేంద్రానికి నివేదిస్తోంది. దరఖాస్తుదారులు గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేలు, ఇతర ప్రాంతాల్లో రూ.96 వేల వార్షిక ఆదాయం కలిగి ఉండాలి. ఉపకార వేతనం కోసం దరఖాస్తు చేసిన పిల్లల ఆదాయ, కులధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు, చదువుతున్నట్లు ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఖాతా, తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రాలు, సంరక్షకుల ఆధార్ కార్డులు, పిల్లల పాస్‌పోర్టు సైజు ఫొటో ఇలా జత చేయాల్సి ఉంటుంది.



ఇప్పుడు 85 దరఖాస్తులు వచ్చాయి



కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల నుంచి మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తోంది. ఏలూరు జిల్లాలో 417 మందికి రూ.1.08 బడ్జెట్ కేటాయించి ఒక్కొక్కరికి రూ.24 వేలు ఖాతాలకు జమ చేశాం. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను స్త్రీ శిశు సంక్షేమశాఖ ఎంపిక చేసి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి నివేదిస్తాం. ఏలూరు జిల్లాలో ప్రస్తుత బడ్జెట్‌కు 85 దరఖాస్తులు అందాయి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఈ పథకం అవగాహన కలిగిస్తున్నాం.

– కేపీఎల్ పద్మావతి, ఐసీడీఎస్, ప్రాజెక్టు డైరెక్టర్, ఏలూరు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలలో జమ చేసిన నగదును సంరక్షకులు కేవలం వారి చదువు, వైద్యానికి మాత్రమే ఖర్చు చేయాలి. ప్రతి దానికి లెక్క ఉంటుంది. పూర్వం రూ.500, రూ.1000, రూ.2000 సాయం అందించేవారు. ఇప్పుడు మొత్తం సేవలను మిషన్ వాత్సల్య పథకం కింద ఒకే గొడుగులోకి తీసుకువచ్చి నెల రూ.4 వేలు అందిస్తున్నారు. ఈ పథకాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ వి.దీప్తి, ఐసీడీఎస్ సీడీపీవో, కైకలూరు

సంరక్షకులకు భారం కాకుండా..



మిషన్ వాత్సల్య పథకం నాకు అండగా నిలిచింది. చిన్నప్పుడు నా తల్లిదండ్రులు మరణించారు. అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ చదువుకుంటున్నాను. బాగా చూసుకుంటున్నారు. నాకు ఉన్నత చదువులు చదవాలనే కోరిక ఉంది. ఇటువంటి సమయంలో మిషన్ వాత్సల్య పథకానికి ఎంపిక చేశారు. నా బ్యాంకు ఖాతాలో రూ.24 వేలు జమ అయ్యాయి. సంరక్షకులకు భారం కాకుండా ప్రభుత్వాలు గుర్తించి ఆదుకోవడం ఎంతో ఆనందంగా ఉంది.

– కె.సౌమ్య, సానారుద్రవరం, కలిదిండి మండలం.

మస్కట్ నుంచి స్వగ్రామానికి వస్తూ..



బొంతా సత్యపద్మ (ఫైల్)

అత్తిలి: ఉపాధి కోసం మస్కట్ వెళ్లిన ఓ వివాహిత అనారోగ్యంతో తిరిగి స్వదేశానికి వస్తూ మార్గ మధ్యంలో మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. మంచిలి గ్రామానికి చెందిన బొంతా సత్యపద్మ (31)జీవనోపాధి నిమిత్తం విజయవాడకు చెందిన మహిళా ఏజెంట్ ద్వారా గతేడాది ఆగస్టులో మస్కట్‌కు వెళ్లింది. సత్యపద్మకు గుండెకు సంబంధించిన సమస్య ఏర్పడటంతో ఆమె ఆరోగ్యం క్షీణించడంతో ఆ సమాచారాన్ని తన భర్త బొంతా ప్రభాకర్‌కు తెలిపింది. దీంతో ఇండియాకు తన భార్యను పంపించి వేయాలని ఏజెంట్‌ను కోరాడు. డబ్బులు కడితేకానీ సత్యపద్మను ఇండియాకు పంపించడం జరగదని ఏజెంట్ చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో భర్త అప్పు చేసి ఏజెంట్‌కు రూ.2.10 లక్షలు చెల్లించారు. అయితే తన భార్యను ఏజెంట్ ఈనెల 30న ఇండియాకు పంపిస్తానని చెప్పి, ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఈనెల 24న ఇండియాకు విమానం ఎక్కించి పంపించి వేశారని భర్త ఆవేదన వ్యక్తం చేశాడు. హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి సత్యపద్మ ఆర్టీసీ బస్సులో వస్తుండగా విజయవాడకు వచ్చేసరికి గుండెపోటుతో బస్సులోనే ప్రాణాలు విడిచింది. అక్కడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబానికి ఆసరాగా ఉపాధి నిమిత్తం వెళ్లి విగతజీవిగా తిరిగి రావడంతో కుటుంబసభ్యులు జీర్ణించుకోలేక పోతున్నారు. ప్రభాకర్ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి పుట్టినిల్లు నిడదవోలు మండలం కోరుమామిడి గ్రామం.

ట్రాక్టర్ ఢీకొని ఉపాధ్యాయురాలు దుర్మరణం



మృతురాలు ప్రసన్న లక్ష్మి

కామవరపుకోట: కొత్తూరు చెక్‌పోస్టు సెంటర్ వద్ద ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఓ ఉపాధ్యాయురాలు దుర్మరణం పాలైంది. వివరాలిలా ఉన్నాయి. రామన్నపాలెం గ్రామపంచాయతీ మారుతీనగర్‌లో నివాసం ఉంటున్న వంపుగాని రవికుమార్ తాడిచర్ల ప్రభుత్వ పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తుండగా, భార్య ప్రసన్నలక్ష్మి (38) కామవరపుకోట జెడ్పీ హైస్కూల్‌లో ఆంగ్ల ఉపాధ్యాయురాలుగా పనిచేస్తోంది. బుధవారం ఉదయం పాఠశాల విధులకు హాజరయ్యేందుకు భార్యాభర్తలు ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కొత్తూరు చెక్‌పోస్ట్ సెంటర్ వద్దకు వచ్చేసరికి ద్విచక్ర వాహనం అదుపుతప్పి భార్యాభర్తలిద్దరూ కింద పడిపోయారు. అదే సమయంలో సేంద్రియ ఎరువు లోడుతో అటుగా వచ్చిన ట్రాక్టర్ ఆమెపై నుంచి వెళ్లడంతో, తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రి తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి మృతదేహం లభ్యం



యనమదుర్రు డ్రెయిన్‌లో లభ్యమైన బాలుడి మృతదేహం

భీమవరం అర్బన్: గొల్లవానితిప్పలో యనమదుర్రు డ్రెయిన్‌లో 17 సంవత్సరాల బాలుడి మృతదేహం బుధవారం లభ్యమైంది. మృతదేహాన్ని స్థానికులు చూసి సమాచారాన్ని రూరల్ ఎస్సై జి.రాజుకు అందించారు. పాలకోడేరు పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 26న బాలుడి అదృశ్యంపై కేసు నమోదైందని పోలీసులు చెప్పారు.

బాలికను కాపాడిన మహిళా కానిస్టేబుల్

తణుకు: వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు యత్నించిన ఓ బాలికను రైల్వే మహిళా కానిస్టేబుల్ కాపాడిన ఘటన బుధవారం తణుకు రైల్వే స్టేషన్‌లో చోటు చేసుకుంది. తణుకు మండలానికి చెందిన ఒక బాలిక బుధవారం ఆత్మహత్య చేసుకునేందుకు తణుకు రైల్వేస్టేషన్ ప్రాంతానికి చేరుకుంది. సమాచారం అందుకున్న బంధువులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మహిళా రైల్వే కానిస్టేబుల్ ముద్దే బాల ఆమెను వారించి కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగించారు. ఈ సందర్భంగా కానిస్టేబుల్ బాలను పలువురు అభినందించారు.

విగ్రహం చోరీపై ముమ్మరంగా దర్యాప్తు

ఆగిరిపల్లి: ఎగువ కొండపై ఉన్న శ్రీశోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి వారి పంచలోహ విగ్రహం చోరీ ఘటనలో దర్యాప్తు ముమ్మరంగా సాగుతుంది. ఆలయ ఈవో సురేష్ బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై సురేంద్రకుమార్ బుధవారం క్లూస్ టీమ్‌కు సమాచారం అందించారు. మధ్యాహ్నం ఆలయానికి చేరుకున్న క్లూస్ టీం ఆలయంలోని పరిసరాలను పరిశీలించి వేలిముద్రలను సేకరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అన్ని కోణాల్లోనూ కేసు దర్యాప్తు చేస్తున్నామని స్పష్టం చేశారు.

అర్జావారిగూడెంలో దారుణ హత్య

- అన్న బావమరిదిని కత్తితో నరికిన తమ్ముడు
- అడ్డువచ్చిన అన్న కుమార్తె, అల్లుడిపై దాడి
- ఆస్తి తగాదా నేపథ్యంలో ఘటన



అర్జావారిగూడెంలో దారుణ హత్యకు గురైన చేబత్తుల కృష్ణ (55)



చేబత్తుల కృష్ణ (ఫైల్)



ఏలూరు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గద్దె పూజారాణి



భీమడోలులో కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై వై.సుధాకర్

భీమడోలు : భీమడోలు పంచాయతీ శివారు అర్జావారిగూడెంలో బుధవారం దారుణ హత్య జరిగింది. ఆస్తి తగాదా నేపథ్యంలో జరిగిన ఈ ఘటనలో అన్న బావమరిదిపై తమ్ముడు కత్తితో దాడి చేయడంతో బావమరిది ఘటనా స్థలంలోనే మృతి చెందగా, అన్న కుమార్తె, అల్లుడికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తడపల దుర్గారావు, వెంకటేశ్వరరావు అన్నదమ్ములు. వీరు కట్టెలు అమ్ముకుని జీవనోపాధి సాగిస్తున్నారు. తడపల దుర్గారావుకు, చేబత్తుల కృష్ణ (58) సోదరి మణితో కులాంతర వివాహం జరిగింది. వీరికి కొడుకు, కుమార్తె ఉన్నారు. కుమార్తె పూజారాణి కొంతకాలం క్రితం ద్వారకాతిరుమల మండలం తక్కెళ్లపాడుకు చెందిన గద్దె మోజెస్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. ఈ వివాహం తల్లి మణికి ఇష్టమైనా, తండ్రి దుర్గారావు ఇష్టం లేదు. ఇటీవల పూజారాణి భర్త మోజెస్‌తో కలిసి అర్జావారిగూడెంలోని తన తల్లి మణి ఇంటి స్థలంలో నివాసం ఉంటోంది. ఇదిలా ఉండగా దుర్గారావు కొడుకు అరుంధతీ కాలనీలో ఇల్లు నిర్మించుకునేందుకు అవసరమైన రూ.2 లక్షల సొమ్మును పూజారాణి భర్త మోజెస్‌కు అప్పుగా ఇచ్చాడు. ఇదిలా ఉండగా కొన్ని నెలల క్రితం దుర్గారావు భార్య మణి మృతి చెందింది. దీంతో మేనమామ చేబత్తుల కృష్ణ తన చెల్లి ఆస్తి 3 సెంట్ల స్థలాన్ని మేనకోడలు పూజారాణికి పెద్దల సమక్షంలో రాసేశాడు. దీంతో కథ అడ్డం తిరిగింది. తన భార్య స్థలంలో వేసుకున్న ఇంటిని ఖాళీ చేసి వెళ్లిపోవాలని, ఆ స్థలం తనదని కుమార్తె, కృష్ణలపై దుర్గారావు పెద్దలతో కలిసి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఇరువర్గాల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇద్దరి ఇళ్లు రహదారికి ఇరుగు పొరుగున ఉంటాయి. ఈ నేపథ్యంలో ఉదయాన్నే మేనమామ ఇంటికి వచ్చిన పూజారాణిని చూసిన తండ్రి దుర్గారావు కోపోద్రిక్తుడై గొడ్డలితో చంపేందుకు ప్రయత్నించగా, అక్కడ ఉన్న కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇంతలో ఆతని సోదరుడు వెంకటేశ్వరరావు పరుగున కోళ్ల కత్తితో వచ్చి తాపీ పనికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న కృష్ణ మెడ, తలపై నరికాడు. అడ్డువచ్చిన అన్న కుమార్తె పూజారాణి, ఆమె భర్త మోజెస్‌పై కత్తితో దాడి చేయడంతో పూజారాణి అపస్మారక స్థితిలోకి చేరుకోగా, మోజెస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మృతుని భార్య నాగమణి, కుమార్తెలు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తుల ప్రమేయం ఉందని నాగమణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కృష్ణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి భీమడోలు సీఐ బీబీ రవికుమార్ పర్యవేక్షణలో ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

మృతుడి బంధువుల ధర్నా

భీమడోలు: చేబత్తుల కృష్ణ హత్యను నిరసిస్తూ అతని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ బుధవారం సాయంత్రం భీమడోలు జంక్షన్ సమీపంలో అంబులెన్స్‌లో మృతదేహాన్ని ఉంచి రోడ్డుపై ధర్నా చేశారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, తహసిల్దార్ బి.రమాదేవి కుటుంబాలకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడి మృతి

ఏలూరు టౌన్: బైక్‌పై వెళుతూ ఆగి ఉన్న లారీని ఢీకొన్న ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. వట్లూరు హౌసింగ్ బోర్డు కాలనీలో నివసిస్తున్న బూసి రాంబాబు (25) ఈనెల 27న రాత్రి బైక్‌పై ఏలూరు వచ్చి తిరిగి ఇంటికి బయలుదేరాడు. మినీ బైపాస్ రోడ్డులో విజయా గార్డెన్స్ సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న లారీని రాంబాబు వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన అతనిని స్థానికులు 108లో ఏలూరు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

ఘనంగా విజయగణపతి విగ్రహ ప్రతిష్ఠ


విజయగణపతి స్వామిని దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని చిన తాడేపల్లి గ్రామంలో తిరుమలసాయి నగర్‌లో విజయగణపతి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం జరిగింది. మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయ గణపతిస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ కర్రి భాస్కరరావు, నాయకులు బొద్దాని శ్రీనివాస్, చెన్నా జనార్ధనరావు, పత్సమట్ల సావిత్రి, పత్సమట్ల బాలాజీ తదితరులు ఉన్నారు.

రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నేతలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సెప్టెంబర్ 21, 22 తేదీలలో రాజకీయ శిక్షణ తరగతులు విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దాన వర ప్రసాద్ కోరారు. విమాల నగర్ సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నాయకులు, కార్మికులు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దేశంలో కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీజేపీ సర్కార్‌పై పోరాటాలు చేసేందుకు కార్మిక వర్గం సంఘటితం కావాలని, శిక్షణ తరగతులలో భవిష్యత్తు కార్యాచరణ చేస్తారని చెప్పారు. కేవీ రమణ, రామ్మోహన్, బద్దా వెంకట్రావులు పాల్గొన్నారు.

వాణిజ్యపన్నుల శాఖ ఉద్యోగుల నిరసన


తణుకులో నిరసన తెలియజేస్తున్న ఉద్యోగులు

తణుకు: వాణిజ్యపన్నుల శాఖలో పునః వ్యవస్థీకరణ పేరుతో జరిగిన విధానాలపై దర్యాప్తు చేయించాలని ఏపీ కమర్షియల్ టాక్సెస్ సర్వీసెస్ అసోసియేషన్ ఏలూరు డివిజన్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. ఈ మేరకు తణుకు శాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నిరసన తెలిపారు. ఉద్యోగుల బదిలీలపై శాశ్వత విధానం రూపొందించాలని, ప్రాంతీయ కార్యాలయాలను రద్దు చేయాలని, గత అయిదేళ్లలో వాణిజ్య పన్నుల శాఖలో జరిగిన విధానాలపై దర్యాప్తు చేయాలని నినాదాలు చేశారు. వాణిజ్య పన్నుల శాఖలో అధికారాల కేంద్రీకరణతోపాటు సర్కిల్స్ వ్యవస్థను బలహీనపరిచే చర్యలను వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం


తాళ్లూరి పార్వతి

తణుకు: తణుకు మండలం పైడిపర్రు గ్రామానికి చెందిన వృద్ధురాలు కనిపించడం లేదని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ ఏజీఎస్ మూర్తి తెలిపారు. రైల్వేస్టేషన్ సాయిబాబా గుడి సమీపంలో నివాసం ఉంటున్న తాళ్లూరి పార్వతి ఈనెల 15న గుడికి వెళుతున్నానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె బంధువుల ఇళ్లతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో కోడలు తాళ్లూరి శ్రీవల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణను పునఃపరిశీలించాలి

ఆకివీడు : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాలని మాల సంఘం జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ మాలజాతి ఐక్యతతో వర్గీకరణను వ్యతిరేకించాలన్నారు. జాతి కోసం తాము నిరంతరం పోరాడతామని స్పష్టం చేశారు. వర్గీకరణను నిలుపుదల చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, నవంబర్ నెలలో 10 లక్షల మందితో విజయవాడలో ఉద్యమం చేపడతామన్నారు. జేఏసీ జిల్లా ఆర్గనైజర్ కోన జోసఫ్ మాట్లాడుతూ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలలంతా ఒకటిగా నిలబడాలన్నారు. 2004లో వర్గీకరణ చెల్లదని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చి, అందరూ కలిసి ఉండాలని సూచిస్తే, నేడు వర్గీకరణకు తీర్పు ఇవ్వడం దారుణమని ఆరోపించారు.



కోల్‌కతా ఘటన దారుణం



ప్రజల ఆరోగ్యాలను బాగు చేస్తూ వారి శ్రేయస్సు కోసం తపించే వైద్యులకు రక్షణ లేకపోవడం దురదృష్టకరం. కోల్‌కతా ఘటన మరోసారి ఎక్కడా జరగకుడదంటే ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. వైద్య సిబ్బందికి ప్రత్యేక రక్షణ కల్పించాలి. పోలీస్ సిబ్బంది ఆస్పత్రుల వద్ద రాత్రి వేళ గస్తీ నిర్వహించాలి. అప్పుడు కొద్దిగా వైద్య సిబ్బందికి రక్షణ కలుగుతుంది. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదిశగా చర్యలు తీసుకోవాలి

– జి ఎం. రాజకుమారి, అంగన్ వాడీ కార్యకర్త, తణుకు

వైద్యులకు రక్షణ కల్పించాలి



వైద్యులకు రక్షణ కల్పించాలి. ఇటీవల వైద్యులపై దాడులు జరుగుతున్నాయి. ప్రజలకు 24గంటలు వైద్య సేవలు అందిస్తున్న వైద్యులపై దాడులు నిర్వహించడం దారుణం. కోల్‌కతాలో మహిళా వైద్యులపై అత్యాచారం చేసి హత్య చేయడం సిగ్గుచేటు. ఆస్పత్రి స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చించి చర్యలు తీసుకోవాలి. ఇటువంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– తానేటి మధుషీల, అంగన్‌వాడీ కార్యకర్త, పైడిపర్రు

రైల్వేస్టేషన్ అభివృద్ధి చేసినా..!


ఒకటో నెంబరు ప్లాట్‌ఫామ్‌పై ప్రారంభించిన లిఫ్ట్ నిర్మాణ పనులు


తణుకు రైల్వే స్టేషన్‌లో రెండో నెంబరు ప్లాట్‌ఫామ్

- లిఫ్టు నిర్మాణంలో జాప్యం
- ఎట్టకేలకు ప్రారంభించిన లిఫ్టు నిర్మాణం

తణుకు: రూ. వందల కోట్ల వ్యయంతో తణుకు రైల్వే స్టేషన్ అభివృద్ధి చేశారు. ప్రత్యేంగా రైల్వేస్టేషన్ భవనాల నిర్మాణం చేపట్టారు. భీమవరం–నిడదవోలు రైల్వే మార్గాన్ని డబ్లింగ్ చేయడంతో పాటు విద్యుదీకరణ చేశారు. దీంతో ఈ మార్గంలో రైలు ప్రయాణం సుఖవంతమైంది. అయితే వృద్ధులు, దివ్యాంగులకు ఉపయోగపడే లిఫ్టు నిర్మాణంలో మాత్రం రైల్వే అధికారులు జాప్యం చేస్తున్నారు. తణుకు రైల్వేస్టేషన్‌లోని ఒకటో నెంబరు ప్లాట్‌ఫామ్ నుంచి రెండో నెంబరు ప్లాట్‌ఫామ్‌పైకి రాకపోకలు సాగించడానికి సౌకర్యవంతంగా లిఫ్టు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అయితే రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ చేపట్టి ఏడాది గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ లిఫ్టు అందుబాటులోకి రాలేదు.

వాణిజ్యప్రాంతంగా అభివృద్ధి...

పారిశ్రామిక, వాణిజ్య ప్రాంతంగా అభివృద్ధి చెందిన తణుకు పట్టణం రోజురోజుకూ మరింత అభివృద్ధి చెందుతోంది. సాధారణంగా తణుకు చుట్టుపక్కల ప్రాంతాల్లో పరిశ్రమలు విస్తరించడంతో ఇక్కడి నుంచి బియ్యం, ఎరువులు, ఇతరత్రా ఎగుమతులు జరుగుతుంటాయి. దీంతో తణుకు రైల్వేస్టేషన్ నుంచి గూడ్స్ వ్యాగన్ల ద్వారా పెద్ద ఎత్తున నిత్యం ఎగుమతులు, దిగుమతులు జరుగుతుంటాయి. ఈ క్రమంలో తణుకు రైల్వే స్టేషన్ నుంచి సైతం విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ పరిస్థితుల్లో తణుకు రైల్వేస్టేషన్ నిత్యం రద్దీగా ఉంటుంది. మరోవైపు సుదూర ప్రాంతాలతోపాటు పాసింజర్ రైళ్లు సైతం తణుకు మీదుగా ప్రతిరోజు సుమారు 20 వరకు సర్వీసులు నడుస్తున్నాయి. అయితే ఇటీవల రైల్వే ఆధునికీకరణలో భాగంగా తణుకు రైల్వే స్టేషన్‌ను అభివృద్ధిచేశారు. అయితే ఈ స్టేషన్ లో లిఫ్టు అందుబాటులోకి తీసుకురావాలని గతంలో పలు ప్రజా సంఘాల నాయకులు రైల్వే ఉన్నతాధికారులకు విన్నవించుకున్నారు. ఏడాది క్రితమే అభివృద్ధి పనులు పూర్తి చేసినప్పటికీ లిఫ్టు మాత్రం ప్రతిపాదనల దశలోనే నిలిచిపోయింది. దీంతో వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎట్టకేలకు ప్రారంభం

తణుకు నుంచి సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణీకులు లగేజీతో మెట్లుమార్గం వెంబడి ఒకటో నెంబరు ప్లాట్‌ఫామ్ నుంచి రెండో నెంబరు ప్లాట్‌ఫామ్‌పైకి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. మరోవైపు రాత్రి సమయాల్లో సైతం వీరంతా ఇబ్బందులు పడుతున్నారు. వీరి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని లిఫ్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ పెరిగింది. అయితే ఇటీవల ఒకటో నెంబరు ప్లాట్‌ఫామ్‌పై లిఫ్టు నిర్మాణ పనులు ఎట్టకేలకు ప్రారంభించడంతో ప్రయాణీకులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఎప్పటినుంచో ప్రతిపాదనల దశలో ఉన్న లిఫ్టు నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. త్వరలోనే లిఫ్టును అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

హార్టీకల్చర్‌లో సుస్థిరతకు సాంకేతికత అవసరం


ఉద్యాన వర్సిటీలో సాంకేతిక శిక్షణకు హాజరైన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: ఉద్యాన పంటల్లో సుస్థిరతకు సాంకేతికత అవసరం చాలా ఉందని వెంకట్రామన్నగూడెంలోని ఉద్యానవర్సిటీలో వర్చువల్ మోడ్‌లో రెసిలెంట్ అగ్రికల్చర్ హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్ ప్రాజెక్టు కింద శిక్షణలో భాగంగా రెండో రోజు బుధవారం పలు అంశాలపై నిపుణులు వివరించారు. వెజిటబుల్ సైన్సు, కాకరలో జెనెటిక్స్ అండ్ క్యూటిఎల్ మ్యాపింగ్, కూరగాయల సేంద్రీయసాగు, భారతీయ కూరగాయల విత్తన పరిశ్రమ బలాలు, బలహీనతలు, సోలనేషియస్ కూరగాయలు, బెండ రకాలు, సంకర జాతుల పొండేషన్ సర్టిఫైడ్ సీడ్ ప్రొడక్షన్, ఫ్యూ చరిస్టిక్ ఫ్లోరీకల్చర్ , అటోకాడ్ ఇన్ ల్యాండ్ స్కేప్ డిజైనింగ్ అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కె.ఉషాకుమారి, పి.గంగాధరరావు, డాక్టర్ లలిత, బీవీజీ ప్రసాద్, ఏవి.డి.దొరాజీ రావు, సీహెచ్ .సాయి రత్న శరవాణి, వీసీ కె.గోపాల్, ఎస్.సూర్యకుమారి, ఉద్యాన కళాశాలల డీన్‌లో బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి


మాట్లాడుతున్న న్యాయమూర్తి డి.సత్యవతి

తణుకు అర్బన్: వచ్చేనెల 14వ తేదీన తణుకు కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించేందుకు న్యాయవాదులు కృషి చేయాలని మండల న్యాయసేవాధికారం సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. తణుకు కోర్టులో బుధవారం తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి నిర్వహిస్తున్న ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకాదగ్గ ప్రతి కేసుపైనా న్యాయవాదులు దృష్టి సారించి ఇరు పక్షాలతో మాట్లాడి కేసు పరిష్కరించే దిశగా పాటు పడాలని కోరారు. అంతేకాకుండా ప్రతిరోజూ తణుకు కోర్టులో ప్రి లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తూ కేసులను పరిష్కారిస్తున్నామని, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కూడా కేసులు రాజీకి ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. కక్షిదారులు కేసుల కోసం కాకుండా రాజీ మార్గాన్ని ఎంచుకుంటే విలువైన డబ్బు, సమయం కూడా ఆదా చేసుకోవచ్చనే విషయాన్ని వారికి తెలియజేప్పాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.సాయిరాం, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పీవీకే రంజిత్‌కుమార్, స్పెషల్ కోర్టు మేజిస్ట్రేట్ చిరంజీవి రావు, సెకండ్ అడిషినల్ బెంచ్ కోర్టు స్పెషల్ మేజిస్ట్రేట్ తాడి ఆంజనేయులు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కొండ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఇ.రామకృష్ణ, న్యాయవాదులు కామన మునిస్వామి, తిర్రే సత్యనారాయణరాజు, అంగజాల అజయ్‌కుమార్, గోటేతి ప్రసాద్ పాల్గొన్నారు.

చవితి వేడుకలకు నిబంధనలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నాగేశ్వరరావు

తణుకు: రాబోయే వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని కమిటీ సభ్యులు నిబంధనలు పాటించాలని తణుకు రూరల్ సీఐ జీవీవీ నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం తణుకు రూరల్ పోలీసు స్టేషన్ ఆవరణలో ఆయా గ్రామ కమిటీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. చవితి మండపాలు ఏర్పాటుకు సంబంధించి కచ్చితంగా అనుమతులు తీసుకోవాలన్నారు. మండపం ఏర్పాటు చేసే స్థల యజమాని నుంచి అనుమతి పత్రంతోపాటు విద్యుత్ సరఫరాకు సంబంధించి విద్యుత్‌శాఖ అధికారుల నుంచి సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. అనుమతి పత్రంలో నిర్వహకుల పేర్లు, ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారనే సమాచారాన్ని పొందుపరచాలని చెప్పారు. ఆయా మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో తణుకు మండల తహసీల్దార్ అశోక్‌వర్మ, రూరల్ ఎస్సై ఏజీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పనుల పరిశీలన

వీరవాసరం: స్థానిక భవిత కేంద్రాన్ని, రాయకుదురు కవురు వారి వీధి ప్రాథమిక పాఠశాలను ఎస్ఎస్ఏ ఏపీసీ పి.శ్యాంసుందర్ బుధవారం సందర్శించారు. కవురు వారి వీధి పాఠశాల ప్రహరీ అసంపూర్ణంగా ఉందనే విషయాన్ని గ్రామస్తులు అడగ్గా, వారు ప్రహరీ ప్రస్తుత స్థితిని, నాడు–నేడు పనుల పరిశీలించడం పాఠశాలకు వచ్చామన్నారు. పాఠశాలను పరిశీలించి మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్నందున్న త్వరలోనే ప్రహరీ నిర్మాణానికి అనుమతి ఇస్తామని తెలియజేశారు. హెచ్ఎం డి.పుల్లారావు, ఉపాధ్యాయులు ఎం.జయలక్ష్మి ఏపీసికి వివరాలను తెలియజేశారు. అనంతరం భవిత సెంటర్‌లోని రికార్డులను పరిశీలించారు.

పొంచి ఉన్న ప్రమాదం

- గూడెంలో కల్వర్టుపై ధ్వంసమైన ఇనుప గ్రీల్స్
- సమస్యను పట్టించుకోని అధికారులు


కల్వర్టులపై సిమెంట్ పలకల నుంచి ఇనుప చువ్వలు బైటకు వచ్చిన దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్: ఎటు చూసిన నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. అధికారులకు పట్టడం లేదు. ప్రజాప్రతినిధులు అసలే పట్టించుకోరు. ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటించలేదనడానికి ఈచిత్రలే నిదర్శనం. పట్టణంలోని రహదారుల మలుపుల వద్ద డ్రెయినేజీలపై ఏర్పాటు చేసిన కల్వర్టులు ప్రమాదభరితంగా మారాయి. కల్వర్టులపై ఏర్పాటు చేసిన సిమెంట్ పలకలు పగిలి పెచ్చులూడి లోపల ఉన్న ఇనుప చువ్వలు బైటకు వచ్చాయి. దీంతో కల్వర్టులపై ద్విచక్ర వాహనారులు ప్రయాణం చేసి సందర్భాల్లో వాహనాల టైర్లకు సిమెంట్ పలకల నుంచి బైటకు వచ్చిన ఇనుప చువ్వలు గుచ్చుకొని టైర్లకు పంచర్ పడుతున్నాయి. వాహన చోదకులు, పాదాచారులు అదమరిస్తే అంతే మరి. సమస్య చిన్నదైనా... ప్రమాదం పెద్దది కావచ్చు. ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు ఇది ఏమంత పెద్ద సమస్య కానట్టు వ్యవహరిస్తున్నారో..ఏమో తెలియదు గానీ..ప్రమాదం మాత్రం పొంచి ఉంది. తక్షణమే ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సిమెంట్ పలకలు ఏర్పాటు చేస్తున్నాం

కల్వర్టులపై పగిలిన సిమెంట్ పలకలకు కొన్ని ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టాం. కొన్ని ప్రాంతాల్లో పాడైన పలకల స్థానంలో నూతన సిమెంట్ పకాలు ఏర్పాటు చేశాము. అవసరమైన ప్రాంతాల్లో మరమ్మతులు కూడా చేపడుతున్నాం.

– డి.మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్, తాడేపల్లిగూడెం

మత్తు పదార్థాలతో జీవితం నాశనం


అత్తిలి డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ నాగేశ్వరరావు

అత్తిలి: యువత మత్తు పదార్థాలకు బానిసై బంగారు జీవితాన్ని పాడుచేసుకోవద్దని తణుకు రూరల్ సీఐ జీవీవీ నాగేశ్వరరావు కోరారు. బుధవారం అత్తిలి ఎస్వీఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో మత్తు పదార్థాలు వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి విక్రయాలపట్ల ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తోందని సీఐ తెలిపారు. గంజాయిని ఎవరైనా విక్రయిస్తే సమాచారం పోలీసులకు తెలపాలన్నారు. మహిళలు, బాలికలను వేధింపులకు గురిచేసేవారిపై కఠిన శిక్షలు ఉంటాయన్నారు. ఇటీవల కాలంలో పెరిగిపోయిన ఆన్‌లైన్ మోసాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు. లోన్‌యాప్‌ల జోలికి వెళ్లరాదని సూచించారు. సైబర్ నేరాలు జరిగితే వెంటనే 1930కి ఫోన్‌చేయాలని సూచించారు. కార్యక్రమంలో అత్తిలి ఎస్సై పి ప్రేమరాజు, కళాశాల కమిటీ చైర్మన్ దాసం గోవిందరావు, ప్రిన్సిపాల్ పమ్మి శర్మ, ఏఎస్సై ఎం వెంకట్రావు, కృష్ణారావు పాల్గొన్నారు.

విద్యుత్ అమరవీరులకు ఘన నివాళి


విద్యుత్ అమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీపీఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి ఏపీ విద్యుత్ అమరవీరుల 24వ వర్ధంతి సభ బుధవారం పట్టణంలో నిర్వహించారు. అమరవీరులకు జోహార్లు అర్పించారు. పార్టీ నాయకులు సిరపరపు రంగారావు, కరెడ్ల రామకృష్ణలు మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై వేస్తే దానికి వ్యతిరేకంగా వంద రోజులు పాటు సుదీర్ఘ పోరాటం అనంతరం బషీర్‌బాగ్‌లో ప్రభుత్వం ధమనకాండ జరిపిందని దాని ఫలితంగా ముగ్గురు ప్రాణాలు కోల్పోగా అనేకమంది గాయపడ్డారన్నారు. నాటి అమరుల ప్రాణ త్యాగం ఫలితంగా ప్రభుత్వం విధించిన భారాలను వెనక్కి తీసుకోక తప్పలేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గొన్నాబత్తుల నాగేశ్వరరావు, జవ్వాది శ్రీను, కరక వెంకట్రావు, నరమాల కృష్ణ, రమణ, సతీష్, లోవ, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణయోగ ధ్యాన మందిరంలో విశేష పూజలు


హోమం చేస్తున్న భక్తులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక రామచంద్రరావు పేటలోని శ్రీకృష్ణయోగ ధ్యాన మందిరంలో బుధవారం దత్తాత్రేయ హోమం, సుదర్శన హోమాలు నిర్వహించారు. అష్టోత్తర పూజలు, ఇతర విశేష పూజలు జరిగాయి. మందిర అధ్యక్షుడు కార్లేపర పాండురంగారావు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు లేకుండా చూడాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి


తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

తాడేపల్లిగూడెం: కుల ధ్రువీకరణ పత్రాల జారీలో తప్పులేని విధంగా రికార్డులను సిద్ధం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సుమోటో కుల ధ్రువీకరణ పత్రాల జారీ పరిశీలనలో భాగంగా బుధవారం గూడెం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరణించిన వారి కుల ధ్రువీకరణ పత్రాలను తిరస్కరించకుండా వారి కుటుంబ సభ్యులకు అందజేయాలన్నారు. ఒక వార్డు నుంచి వేరొక వార్డుకు గాని, వేరు ప్రాంతానికి వెళ్లిపోయిన వారు ఉంటే వారికి సంబంధించిన పత్రాలను ఆయా ప్రాంత వీఆర్‌ఓలకు అందజేయాలన్నారు. ఎస్టీ కులాలకు చెందిన వారు ఉంటే, చదువుకొనే పిల్లల రికార్డులు, గతంలో తహసీల్దార్లు ఇచ్చిన ధ్రువపత్రాల ఆధారంగా ఆధారంగా విచారణ చేయాలన్నారు. అనంతరం పట్టణంలోని 34,36 వార్డులలో క్షేత్రస్థాయిలో కుల ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేశారు. లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం .సునీల్ కుమార్, ఆర్ఐ ప్రభు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

రేపటిలోగా రేషన్ సరుకులు డిపోలకు చేర్చాలి


తణుకు ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఆకస్మిక తనిఖీలు చేస్తున్న జాయింట్ కలెక్టర్ టీ రాహుల్ కుమార్ రెడ్డి

తణుకు టౌన్: అగస్టు 30వ తేదీ లోగా జిల్లాలోని అన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌ల నుంచి ప్రభుత్వ రేషన్ షాపులకు ప్రభుత్వం అందించే నిత్యావసర వస్తువులను చేరవేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టీ రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. బుధవారం తణుకులోని మండల లెవిల్ స్టాక్ పాయింట్‌ను జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా గొడౌన్‌లోని సరుకులను, స్టాక్ రికార్డును, స్టాఫ్ రికార్డును పరిశీలించారు. గొడౌన్‌లో భౌతికంగా ఉన్న నిల్వలకు, రిజిస్టర్లలో ఉన్న నిల్వలను ప్రతి రోజూ సరి చూసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే అన్ని నిత్యావసర వస్తువులు వినియోగదారులకు సకాలంలో అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ టీ శివరామ్‌ప్రసాద్, టెక్నికల్ సహాయ మేనేజర్ ఇబ్రహీం, తహసిల్దార్ డీవీఎస్ ఎస్ వర్మ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి


కె సముద్రపుగట్టులో బాల్యవివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

అత్తిలి: మహిళలకు వచ్చే ప్రతి సమస్యను ధైర్యంగా ఎదుర్కొనేలా చట్టాలపై వారికి అవగాహన తప్పనిసరి అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె కుమారి అన్నారు. బుధవారం అత్తిలి మండలం కె సముద్రపుగట్టు గ్రామంలో బేటీ బచావో–బేటీ పడావో 100 రోజుల కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాల నిరోధకచట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండకుండా వివాహం చేస్తే అదిబాల్య వివాహంగా పరిగణించబడుతుందన్నారు. బాల్యవివాహం చేస్తే పెద్దలకు, పురోహితులు, పాస్టర్లకు, వధువు, వరుడు తల్లిదండ్రులకు జైలు శిక్ష, జరిమానా తప్పదని వివరించారు. మహిళా సంరక్షణ అధికారిణి భవాని గృహ హింస, బాల్యవివాహాల నిరోధక చట్టం, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు దీపికా రాణి, నవోమి, పూర్ణగిరి, ఆశావర్కర్లు లక్ష్మి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరవల్లిలో మిషన్‌శక్తిపై అవగాహన సదస్సు

మహిళలు ఆపద నుంచి బయటపడేలా వారిలో చైతన్యం కల్పిస్తున్నామని మంచిలి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి మహాలక్ష్మి అన్నారు. బుధవారం అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్‌శక్తిపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, మహిళా సంరక్షణ అధికారిణి లక్ష్మీకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త ఉండ్రాజవరపు రాణి, ఏఎన్ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

పసుమర్తి చందుకు నివాళి

తాడేపల్లిగూడెం రూరల్: పెదతాడేపల్లి గ్రామానికి చెందిన పసుమర్తి చంద్రశేఖర శ్రీనివాస్ (చందు)ఇటీవల గుండెపోటుతో కజకిస్తాన్‌లో మృతి చెందగా బుధవారం ఆయన భౌతికకాయం స్వగ్రామం చేరుకుంది. చందు భౌతిక కాయాన్ని తాడేపల్లిగూడెం, ఉంగుటూరు ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వలవల బాబ్జీ తదితరులు నివాళులర్పించారు.

ఆక్వా రైతులకు అవగాహన సదస్సు

వీరవాసరం: మండలంలోని రాయకుదురు పంచాయతీ కార్యాలయంలో ఆక్వా రైతులకు ఏపీఎస్ఏడీఏ అనుమతులు , ఎంపేడా ఎన్‌రోల్‌మెంట్ పై అవగాహన కల్పించారు. ఎంపెడా అధికారి గోపాలకృష్ణ, వీరవాసరం మత్స్య శాఖ అభివృద్ధి అధికారి, ఏడీ భీమవరం–1 శ్రీనివాస్ రావు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ గెద్దం భారతి, వీరవాసరం గ్రామ మత్స్య శాఖ సిబ్బంది బాల నాగేశ్వరరావు, వెంకటేష్,కిషోర్ వర్మ పతదితరులు పాల్గొన్నారు.

పేరు మార్పు ప్రకటన

సత్తి విశ్వహర కిషోర్ S/o సోమరాజు అను నేను D.No.14-45-04 రామారావు పేట తాడేపల్లిగూడెం నివాసిని. నాకు పాస్‌పోర్ట్ కలదు. నా పాస్‌పోర్ట్ నెం. M2385541 నా పాస్‌పోర్ట్‌లో సత్తి విశ్వహరి కిషోర్ అని ఉంది. అది తప్పు పడింది. నా అసలు పేరు సత్తి విశ్వహర కిషోర్ అని మార్చుకోవడం జరిగింది. గమనించగలరు.